సాక్షి కర్నూలు

బుధవారం ၊ 20 ၊ నవంబర్ ၊ 2024



## శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగల బసవన్న నందీశ్వరునికి, క్షేత్రపాలకుడి బయలు వీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు, అధికారులు విశేషపూజలు నిర్వహించారు.



## మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం విశాఖపట్నంకు చెందిన కె.సునీత బృందం భక్తి గీతాలకు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,630.77 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 96.891 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 4,076 |
| అవుట్ ఫ్లో | : 6,929 |

## న్యూస్‌రీల్

### డ్వామా పీడీగా వెంకటరమణయ్య

● ఎట్టకేలకు రెగ్యులర్ పీడీని నియమించిన ప్రభుత్వం



పి.వెంకటరమణయ్య, డ్వామా పీడీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.వెంకటరమణయ్య నియమితులయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా చిట్వేలి మండలానికి చెందిన ఈయన తొమ్మిది నెలల క్రితం వరకు పొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత గుంతకల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయి నెల రోజుల క్రితం వరకు పని చేశారు. తర్వాత మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు బదిలీ అయ్యారు. ఇటీవలనే పోస్టింగ్ కోసం పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో రిపోర్టు చేసుకున్నారు. ఈయనను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొదట్లో డ్వామా పీడీగా శివప్రసాద్ నియమితులయ్యారు. ఈయన విధుల్లో చేరకపోవడంతో జెడ్పీ సీఈవో నాసరరెడ్డి పూర్తి అదనపు బాధ్యతలతో డ్వామా పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ పీడీగా పి.వెంకటరమణయ్య నియమితులయ్యారు.

### జిల్లా బీసీడబ్ల్యూ ఈఓ బదిలీ

కర్నూలు (అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. 2021 మార్చి నెలలో ఇక్కడ డీబీసీడబ్ల్యూఓగా బాధ్యతలు చేపట్టిన ఆమె మూడున్నర సంవత్సరాలుగా జిల్లాలో విధులు నిర్వహించారు. ఆమె అభ్యర్థన మేరకు వ్యక్తిగత కారణాల వల్ల ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ నెల్లూరుకు బదిలీ చేస్తూ బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ పోలా భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సహాయ బీసీ సంక్షేమ అధికారులుగా పనిచేస్తున్న పలువురికి పదోన్నతులు కల్పించనున్న నేపథ్యంలో ఇక్కడికి రెగ్యులర్ అధికారిని నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

### నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 19 నుంచి 26 వరకు పొడిగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 ఫిబ్రవరి 8వ తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందని వెల్లడించారు. 9వ తరగతి విద్యార్థులు https:// navodaya. gov.in వెబ్ సైట్లో, 11వ తరగతి విద్యార్థులు https:// cbseitms.nic.in/2023 వెబ్ సైట్లో గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### వైద్యులు సాయంత్రం వరకు ఆసుపత్రిలో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాల్లో సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు సీనియర్ వైద్యులు అందుబాటులో ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అన్ని విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఈ-హాస్పిటల్, ఎన్‌టీఆర్ వైద్యసేవ అమలు ఇంకా మెరుగవ్వాలన్నారు. అన్ని విభాగాల్లో ఉండే హౌస్‌సర్జన్లు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా తప్పకుండా హాజరు వేసేలా సంబంధిత హెచ్‌వోడీలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు సెలవు మంజూరు కోసం సంబంధిత హెచ్‌వోడీ ద్వారా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ల కార్యాలయానికి పంపించేలా చూడాలన్నారు.గైనిక్, పీడియాట్రిక్ విభాగాల్లో త్వరలో విజిటర్ పాసులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ భరోసా మెడికల్ బోర్డు ఓపీ నెం.41 సదరంలో ప్రతి బుధవారం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

## త్రిశంకు స్వర్గంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

● ప్రారంభమై 8 నెలలైనా మొదలుకాని సేవలు
● రూ. కోట్ల విలువైన యంత్రాలున్నా అనుమతులు తెచ్చుకోలేని వైనం
● 120 పడకల ఆసుపత్రిలో ఒక్కటీ కూడా రాలేదు
● రోజుకు ఓపీ 10 నుంచి 15 దాటని వైనం
● గత ప్రభుత్వం నిర్మించిందనే కారణంతో కూటమి ప్రభుత్వం జాప్యం



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం

# ఆశయం ఘనం.. సేవలు గగనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అక్కసో.. పేదలంటే అలుసో తెలియదు కానీ కూటమి ప్రభుత్వం వైద్య సేవలను విస్మరిస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో ఆర్భాటంగా ప్రారంభించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఇప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతోంది. భవనం ఉన్నా అవసరమైన పరికరాలు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు ప్రైవేటు బాట పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డాక్టర్లు ఓపీలో కూర్చుంటున్నా పట్టుమని పది మంది కూడా రోగులు చికిత్స కోసం రావడం లేదు. మంజూరైన పోస్టుల్లో 30 శాతం కూడా పోస్టులు భర్తీ చేయకపోవడం, ఉన్న వారికి పనిలేకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతుంది.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు 2017లో అంకురార్పణ జరిగింది. రూ.120 కోట్ల అంచనాతో నిర్మించిన ఈ ఆసుపత్రికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.50 కోట్లను విడుదల చేసింది. 2018లో టాటా ట్రస్ట్ వారు వచ్చి స్థలాన్ని పరిశీలించి బిల్డింగ్ ప్లాన్ ఇచ్చి వెళ్లింది. రాష్ట్ర వాటా కింద రూ.36 కోట్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆసుపత్రిలో రెండు లీనియర్ యాక్సిలరేటరీలు, ఒక సీటీ సిమ్యులేటర్, ఒక హైడోస్ రేట్ బ్రాకోథెరపీ మిషన్ల ఏర్పాటుకు అవసరమైన నాలుగు బంకర్ల నిర్మాణానికి అప్పట్లో టాటా అటామిక్ ఎనర్జీ వారు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో ప్రస్తుతం హెచ్‌డీఆర్ బ్రాకోథెరపీ మిషన్ మాత్రం రావాల్సి ఉంది. రూ.30కోట్లతో లీనియర్ యాక్సిలరేటరీ, రూ.10కోట్లతో సీటీ స్టిమ్యులేటర్ ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు సంబంధించి టాటా అటామిక్ ఎనర్జీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. 2019 జనవరిలో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేసినా ఆ తర్వాత ప్రభుత్వం మారడం, కోవిడ్ రావడం, ఇసుక కొరత తదితర కారణాల వల్ల భవన నిర్మాణం ప్రారంభం కాలేదు. ఇదే క్రమంలో 2022లో క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ ఎండీ పీజీ సీటును నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అప్పట్లో ఆగిపోయిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి పనులు ప్రారంభమయ్యేలా చేసింది. ఈ క్రమంలో గత మార్చి నెలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమయ్యింది.



లీనియర్ యాక్సిలరేటర్ మిషన్

### ఓపీకి 10 మంది మాత్రమే రోగులు

రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న ఆసుపత్రి అవుతుందని ప్రారంభ సమయంలో అందరూ భావించారు. ఆ వెంటనే ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించి, ప్రారంభించిందనే కారణంతో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో తాత్సారం చేస్తోంది. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు కాకపోవడం, వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఇక్కడకు రోగులు సైతం ఓపీకి రావడం లేదు. ఈ మేరకు అధికారులు, వైద్యులు సైతం ధైర్యంగా ఇక్కడ అత్యాధునిక సేవలు అందుతాయన్న భరోసా కల్పించలేకపోతున్నారు. ఇందులో అదనంగా లీనియర్ ఆక్సలరేటర్, ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, సీటీ స్కాన్‌లు, పలు రకాల పరికరాలు రావాల్సి ఉంది.

### మంజూరైంది 247... భర్తీ చేసింది 60 మందిని మాత్రమే

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు గత ప్రభుత్వం 247 పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. కానీ ఇప్పటి వరకు పోస్టులు భర్తీ చేయలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలన్న ప్రయత్నాలు చేస్తోంది. ఈ కారణంగా ఆయా విభాగాలు, ఇతర ఆసుపత్రుల నుంచి 60 మంది వైద్యులు, సిబ్బంది మాత్రం ఇక్కడకు వచ్చి చేరారు. ప్రస్తుతం ఇద్దరు సర్జికల్ ఆంకాలజిస్టులు, ఒక మెడికల్ ఆంకాలజిస్టు, రేడియేషన్ ఆంకాలజీలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరితో పాటు ఇద్దరు పెథాలజిస్టులు, ఇద్దరు సైకియాట్రిస్టులు ఇక్కడ సేవలందిస్తున్నారు. ప్రీవెంటివ్ ఆంకాలజీ ఓపీ సైతం ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహిస్తున్నారు. కానీ రోగులే ఎవ్వరూ రావడం లేదు.



సీటీ స్టిమ్యులేషన్ మిషన్

### 120 పడకల్లో ఒక్కటీ రాలేదు

120 పడకలతో ఏర్పాటైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఇప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పడక కూడా ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా పాత క్యాన్సర్ విభాగంలోనే అవసరమైన అడ్మిషన్లు చేస్తున్నారు. రోగులకు అవసరమైన ఆపరేషన్లు కూడా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రతి నెలా 15 మేజర్, 8 మైనర్ క్యాన్సర్ ఆపరేషన్లను వైద్యులు చేస్తున్నారు. క్యాన్సర్ విభాగంలో 8 ఐసీయూ పడకలు ఏర్పాటు చేసినా అవి అందుబాటులోకి రాలేదు. 9 ఎకరాల్లో నిర్మితమైన ఇంత పెద్ద భవనానికి కనీసం సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది కూడా కేటాయించలేదు. ఈ కారణంగా ఖరీదైన పరికరాలున్న ఈ భవనానికి రక్షణ లేకుండా పోయింది. అవసరమైన వైద్యులు, పారా మెడికల్, నర్సింగ్ సిబ్బందిని, నాల్గవ తరగతి ఉద్యోగులను నియమించి, తగిన పరికరాలను, పడకలను అందుబాటులోకి వస్తే రాయలసీమ ప్రజలకు నాణ్యమైన క్యాన్సర్ వైద్యసేవలు అందించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### త్వరగా పూర్తిస్థాయి సేవలందించాలి



కర్నూలు నగరంలో రాష్ట్రస్థాయి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు కావడం ఎంతో ఆనందకరం. ఇలాంటి ఆసుపత్రి సేవలను ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత సమాజంలో మారిన జీవనశైలి కారణంగా చాలా మంది ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ మేరకు ప్రజల ఆహార, విహారాల్లో మార్పులు చేసుకునేలా సూచనలు చేయాలి. క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలను చైతన్యపరచాలి. ఇది ఒక్క వైద్యులతోనే సాధ్యం అవుతుంది. ఒకవైపు వైద్యం చేస్తూనే మరోవైపు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి.

– డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

### ప్రభుత్వం వెంటనే వసతులు కల్పించాలి



రాష్ట్ర విభజన అనంతరం ఎక్కడో ఏర్పాటవుతుందనుకున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలులో ఏర్పాటైన ప్పుడు అందరూ సంతోషించారు. అయితే ఇది ప్రారంభమై 8 నెలలైనా ఇప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు కొనసాగకపోవడం బాధాకరం. ఇది పూర్తిస్థాయిలో సేవలు అందిస్తే రాయలసీమతో పాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్ర ప్రజలకు సైతం ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం క్యాన్సర్ ఎంతో ఖరీదైన జబ్బుగా మారింది. దీనికి చికిత్సను పేదలు, మధ్యతరగతి ప్రజలు భరించేస్థితిలో లేరు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని అన్ని వసతులు, సౌకర్యాలు, పరికరాలతో పూర్తిస్థాయిలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సేవలు అందించే ఏర్పాటు చేయాలి.

– ఎ. వెంకట్, మెడికల్ రెప్, కర్నూలు

## స్వర్ణరథంపై ఆదిదంపతులు



ఆలయ మాఢవీధిలో కనుల పండువగా స్వర్ణరథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లు స్వర్ణరథంపై ఊరేగారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ శ్రీశైల దేవస్థానం ఈ కార్యక్రమం నిర్వహించింది. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు అర్చకస్వాములు జరిపించారు. స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందుభాగం నుంచి ఆలయ నాలుగు మాఢవీధుల గుండా ఈ కార్యక్రమం సాగింది. రథోత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈఓ చంద్రశేఖర ఆజాద్, సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

### నేడు డీఎల్‌ఎంసీ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పలకడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు నెలన్నర రోజుల క్రితం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ బీమా కింద నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించి బీమా పొందే విధంగా ఆదేశాలు ఇచ్చినప్పటికీ ... రైతుల నుంచి స్పందన లేదు. తాము ప్రీమియం చెల్లించలేమని వారు తేల్చి చెబుతున్నారు. వారితో ఏదో విధగా ప్రీమియం కట్టించే బాధ్యతను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ (డీఎల్‌ఎంసీ) ఏర్పాటు అయింది. డీఎల్‌ఎంసీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయ అధికారి, సభ్యులుగా సీపీవో, జిల్లా రెవెన్యూ అధికారి,జిల్లా ఉద్యాన అధికారి, ఎల్‌డీఎం,నీటిపారుదల శాఖ ఎస్ఈ, పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూసీఐఎస్ అమలు చేస్తున్న బీమా కంపెనీల ప్రతినిధులు, కామన్ సర్వీస్ సెంటర్ల కో–ఆర్డినేటర్లు, నాబార్డు డీడీఎం ఉంటారు. వీరందరితో జిల్లా కలెక్టర్ బుధవారం సమావేశమై రైతులతో ప్రీమియం కట్టించేదెలా అనే దానిపై సమీక్ష నిర్వహించనున్నారు.

### మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించాలి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన కలెక్టర్ రంజిత్‌బాషా, తదితరులు

కర్నూలు(సెంట్రల్): ఇప్పటికే నిర్మించిన మరుగుదొడ్లను వినియోగించేకునేలా ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మన మరుగుదొడ్డి–మన గౌరవం' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టాయిలెట్లను నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ మల విసర్జన, మూత్రవిసర్జన ఆరోగ్యానికి హానికరమన్నారు. అనంతరం జిల్లాకు మంజూరైన 5,284 మరుగుదొడ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈనెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు మరుగుదొడ్ల దినోత్సవాలను నిర్వహించాలన్నారు. ఉత్తమ మరుగుదొడ్లకు జిల్లా, మండల, గ్రామస్థాయి అవార్డులను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా పసుపుల గ్రామ పారిశుద్ధ్య కార్మికులు భాస్కర్, వాణెమ్మ, హేమలత, రాజామణి, భాస్కర్, నాగేశ్వరరావు, ప్రతాప్‌ను కలెక్టర్, తడనకపల్లె, పసుపల సర్పంచ్‌లు షేక్‌బీ, శీలమ్మ శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, కర్నూలు కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

### కుమార్తెను కడతేర్చిన తండ్రి

● మద్యానికి బానిసై ఘాతుకం



మృతి చెందిన మౌనిక

ఆస్పరి: తంగరడోణలో మంగళవారం దారుణం జరిగింది. ఓ వ్యక్తి మద్యానికి బానిసై కుమార్తెను కడతేర్చాడు. గ్రామస్తులు చెప్పిన వివరాల మేరకు.. వీరేష్, పద్మావతి దంపతులకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే వీరేష్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండడంతో మూడు నెలలు క్రితం ఆమె పుట్టినిల్లు అయిన ఎమ్మిగనూరు మండలం బనవాసికి చేరుకుంది. ముగ్గురు కుమార్తెలను తంగరడోణలోనే విడిచి కుమారుడితో వెళ్లింది. ఇద్దరు కుమార్తెలు వ్యవసాయ పనులకు వెళ్తుండగా, చిన్న కుమార్తె మౌనిక(11) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోంది. మంగళవారం స్కూల్ నుంచి విద్యార్థిని ఇంటికి చేరుకుంది. అదే సమయంలో బీరువాలో తండ్రి వీరేష్ డబ్బులు తీసుకుంటుండగా గమనించింది. విషయం తాతకు చెబుతానని చెప్పడంతో ఆగ్రహానికి గురైన తండ్రి పక్కనే ఉన్న తాడు తీసుకుని కుమార్తె గొంతుకు బిగించాడు. అపస్మారక స్థితిలో పడిపోయిన బాలికను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఆస్పరి సీఐ మస్తాన్‌వలి ఆదోని ఏరియా ఆస్పత్రికి చేరుకుని బాలిక కుటుంబీకులను విచారించారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

● అనుమానం వస్తే 1930కు సమాచారమివ్వండి
● ప్రజలకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పిలుపు
● ఎమ్మిగనూరులో సైబర్ నేరాలపై భారీ అవగాహన ర్యాలీ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

ఎమ్మిగనూరు టౌన్: అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ నేరాల కట్టడి సాధ్యమని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు.రోజు రోజుకు పెరిగిపోతున్న ఈ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు పోలీసు సిబ్బంది బైక్ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. తర్వాత ఓం శాంతి సర్కిల్ నుంచి విద్యార్థులు, న్యాయవాదులు, ఆశావర్కర్లు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ఫోన్ నుంచి ఎవరికి ఓటీపీలు షేర్ చేయరాదన్నారు. ఏబ్యాంక్ వారు కూడా వాటిని అడగరని తెలిపారు. డబ్బు సంపాదన కోసం సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. వారిని నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన లేక చాలా మంది వారి ఉచ్చులో పడుతున్నారన్నారు. గత ఆది, సోమవారం రెండురోజుల్లోనే ఏపీలో సైబర్ నేరగాళ్లు రూ.3 కోట్లు దోచుకున్నారన్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు అమాయక ప్రజలు రూ.11 కోట్ల మేర సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయారన్నారు. ఆన్‌లైన్, మీషోలో లక్కీ డ్రా తగిలిందని మభ్యపెడతారని, వాటిని నమ్మరాదన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్,ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో వచ్చే అనుమానిత లింక్‌లను క్లిక్ చేయరాదని సూచించారు. డెబిట్ కార్డ్ బ్లాక్ అయిందని వచ్చే బ్లాంక్ కాల్స్‌ను పట్టించుకోవద్దన్నారు. అనుమానం వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్, వెపన్స్, గంజాయి కొరియర్ వచ్చిందని వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తప్పు చేస్తే నేరుగా అరెస్టులుంటాయని డిజిటల్ అరెస్టులుండవన్నారు. ఇలాంటి విషయాలపై స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులకు చైతన్యం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాల కట్టడిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, పట్టణ, రూరల్ సీఐలు శ్రీనివాసులు, విక్రమ సింహ, రామాంజినేయులు, గంగాధర్, ఎస్ఐలు డాక్టర్ నాయక్, శ్రీనివాసులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీ ఇచ్చారు.. అనుమతులు మరిచారు!

● 50 రోజులు గడుస్తున్నా.. సీఎం హామీల అమల్లో జాప్యం
● కనెక్టివిటీ రోడ్ల పనులకు వీడని గ్రహణం





అధ్వానంగా ఉన్న పుచ్చకాయలమాడ- పెరవలి రోడ్డు, రామచంద్రాపురం రోడ్డు

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి హామీ ఇచ్చారంటే ఎలాంటి పనైనా ఆగమేఘాల మీద జరిగిపోవాల్సిందే. అయితే ఇక్కడ 50 రోజులు గడుస్తున్నా, అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీన జిల్లాలోని పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్లు, భవనాలు, ప్రహరీలు, ఈ గ్రామం నుంచి పక్క గ్రామాలకు కనెక్టివిటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.15.08 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు హామీ ఇచ్చారు. అయితే ఆయన ఇచ్చిన హామీల్లో నేటి వరకు కేవలం రూ.1.88 కోట్ల పనులకు సంబంధించి మాత్రమే పాలనా అనుమతులు వచ్చాయి. మిగిలిన రూ.13.20 కోట్ల పనులకు సంబంధించి పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు అప్పట్లోనే ప్రతిపాదనలు పంపినా, నేటి వరకు పాలనా అనుమతులు మంజూరు చేయడంలో జాప్యం నెలకొంది. అయితే ఈ పనులకు సంబంధించి పాలనా అనుమతులు మంజూరు చేసే విషయంలో ప్రాసెస్ కొనసాగుతోందని, త్వరలోనే పాలనా అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

### అనుమతులు వచ్చిన పనులు ...

- మూడున్నర కిలోమీటర్ల మేర గ్రామంలో రూ.1.38 కోట్లతో 16 సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.20 లక్షలతో హైస్కూల్ ప్రహరీగోడ
- రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

### అనుమతులు రాని పనులు ...

- పుచ్చకాయలమాడ నుంచి పెరవలి వరకు రూ.5.60 కోట్లతో 7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం
- పుచ్చకాయలమాడ నుంచి హోసూరు వరకు రూ.2.40 కోట్లతో 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు
- పుచ్చకాయలమాడ నుంచి రామచంద్రాపురం వరకు రూ.4 కోట్లతో 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డే
- రూ.30 లక్షలతో గ్రామంలో దర్గాకు ప్రహరీగోడ
- రూ.60 లక్షలతో హిందూ స్మశానవాటికకు ప్రహరీగోడ
- రూ.30 లక్షలతో వెటర్నరీ లైవ్ స్టాక్ భవన నిర్మాణం

## క్లుప్తంగా

### సివిల్ సప్లై బఫర్ గోదాము తనిఖీ



గోదామును తనిఖీ చేస్తున్న కొంకతి లక్ష్మీనారాయణ

కర్నూలు(సెంట్రల్):నగరంలోని రేడియో స్టేషన్ సమీపంలో ఉన్న సివిల్ సప్లై గోదామును సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. గోదాము ఇన్‌చార్జ్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. పేదలకు సంబంధించిన సరుకులను సకాలంలో పంపిణీ చేసేలా చూడాలని, ఏమైనా అవకతవకలకు పాల్పడినా, అక్రమాలు చేసినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

### గ్రామ రెవెన్యూ సహాయకుల కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): ఏపీఆర్ఎస్ఏ అనుబంధంగా గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రెవెన్యూ భవన్‌లో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.నాగరాజు, ఎం.లక్ష్మీపతి ఆధ్వర్యంలో వీఆర్ఏల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్.చిన్నస్వామి, టీ.శేఖర్, జిల్లా సహాధ్యక్షుడిగా పాముప్ప, ఉపాధ్యక్షులుగా టి.వెంకటేష్, ఎం.రఘు, ఎన్.రవి,అనిల్, రమేష్, ట్రెజరర్‌గా ఈ.ఎల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా తాయప్ప, రఘు, గోవిందు, వినయ్‌కుమార్, నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా కేశన్న, టి.పెద్దగాజు లింగ, పరమేష్, రామాంజనేయులు,ఆనంద్, పులికొండ, రేణుక, ఉమాదేవిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర సహాధ్యక్షుడు టీజీ రామాంజనేయులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగెట్టిసతీస్, జాయింట్ సెక్రటరీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

### వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె: భార్యను వేధిస్తున్న భర్తతో పాటు అతని తల్లి, సోదరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు..మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి కూతురు షేక్ మాబుచాంద్‌ను 8 ఏళ్ల క్రితం ఆళ్లగడ్డ మండ లం చింతకుంట్ల గ్రామానికి చెందిన షేక్ అమీ ర్‌బాషాకు ఇచ్చి వివాహం చేశారు. అప్పట్లో కట్నంగా రూ.2 లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఇచ్చారు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త లతీఫ్‌మున్నీసా, ఆడబిడ్డ రషీదాబీ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. తండ్రి దస్తగిరి పేరు మీద ఉన్న అర ఎకరం పొలం తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధితురా లు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### సీసీ కెమెరాలపై ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో ఈ నెల 25 నుంచి సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ హబ్ కోర్డినేటర్ గోపీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీతోపాటు ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సు చదివి 18 నుంచి 30 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ పూర్తి వివరాలతో స్థానిక ఐటీఐలో దరఖాస్తు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9542643747 సంప్రదించాలని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు.

# దందాకు 'లైసెన్స్'

- హమాలీల లైసెన్స్‌ల జారీలో మార్కెట్ కమిటీ అక్రమ వసూళ్లు
- 200 మంది కొత్త హమాలీలకు లైసెన్స్‌లు జారీ చేసేందుకు చర్యలు
- ఒక్కో లైసెన్స్‌కు రూ.3 లక్షలపైనే బేరం
- అప్పులు తెచ్చి ముడుపులు ముట్టచెబుతున్న ఆశావహులు

దీపం ఉన్నప్పుడు ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెత కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి తెలిసినంతగా మరెవరికీ తెలియకపోవచ్చు. ఇటీవల అధిక ఉల్లి దిగుబడులు రావడంతో కాటా వేయడంలోనూ, లోడింగ్ చేయడంలోనూ జాప్యం జరిగింది. ఇదే సాకుతో ఏకంగా 200 మంది హమాలీలను నియమించేందుకు రంగం సిద్ధం చేసింది. వారి నుంచి లైసెన్స్ పేరుతో రూ.3 లక్షల చొప్పున బేరం కుదుర్చుకుని రూ.కోట్లు కొల్లగొట్టేందుకు తెరలేపింది. పాలక వర్గం ఏర్పాటు గాకముందే ముడుపులు మూటగట్టుకునేందుకు సిద్ధమైంది.

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్ యార్డులో ఐదు రకాల హమాలీల నియమాకాలకు సంబంధించి లైసెన్‌లు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఇప్పటికే 20 మందికి లైసెన్స్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ ద్వారా పెద్ద ఎత్తున డబ్బు దండుకునేందుకు శ్రీకారం చుట్టినట్లు మార్కెట్ యార్డులో జోరుగా ప్రచారం జరుగుతోంది. మార్కెట్ యార్డుకు ఉల్లితోపాటు వివిధ వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. డిమాండ్‌కు అనుగుణంగా హమాలీలు, కాటాదారులు అవసరం ఏర్పడింది. దీన్ని అదునుగా తీసుకుని మార్కెట్ కమిటీ దందాకు తెరతీసింది. హమాలీలు అవసమని కమీషన్ ఏజెంట్ల సంఘం, వ్యాపారుల సంఘం నుంచి లెటర్లు కూడా తీసుకుని, లైసెన్స్ మంజూరు ప్రక్రియకు ఉపక్రమించింది. అయితే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆశావహుల నుంచి కాసుల పంట పండించుకోవడానికి తెరలేపడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్స్ వస్తే కష్టం చేసుకుని బాగుపడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ముడుపులు ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. లైసెన్ పొందడం వల్ల మార్కెట్‌లో హమాలీలకు సీజన్‌లో కష్టానికి తగినట్లుగా రోజుకు రూ.2000 పైనే లభించే అవకాశం ఉంది. ఏడాది పొడవునా పని ఉండటం వల్ల హమాలీలకు మంచి డిమాండ్ ఉంది. దీనిని గుర్తించిన మార్కెట్ కమిటీ లైసెన్స్‌ల జారీలో కాసుల వేట సాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

**లైసెన్స్‌కు రూ.3 లక్షలపైనే..**

హమాలీ లైసెన్స్‌ల జారీలో రూ.6 కోట్ల వరకు రాబట్టుకోవాలనేది మార్కెట్ కమిటీ లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియను మార్కెట్ కమిటీ నేరుగా కాకుండా దళారీలకు అప్పగించినట్లు సమాచారం. దళారీలను కలిసే ఆశావహులను రూ.3.20 లక్షలు ఖర్చులు డిమాండ్ చేస్తూ.. ఆలస్యంగా వచ్చావని, మార్కెట్ కమిటీలో అడిగి చెబుతామని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అడ్వాన్స్ కింద రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఉల్లి హమాలీల నుంచి రూ.3 లక్షలు, లారీ హమాలీల నుంచి ఇంకా ఎక్కువ మొత్తంలో బేరం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**50 మంది కాటాదారులకు..**

హమాలీ లైసెన్స్‌ల వ్యవహారం మార్కెట్ కమిటీ పరిధిలోనే ఉంటుంది. అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ఉన్నందున హమాలీ లైసెన్స్‌ల జారీ కోసం ప్రతిపాదనలు పంపడమే తరువాయి ఆమోదం లభిస్తుంది. ఇందువల్ల హమాలీల లైసెన్స్‌ల ప్రక్రియ వేగవంతం అయినట్లు తెలుస్తోంది. కాటాదారుల లైసెన్స్‌లు జారీ కోసం మార్కెటింగ్ శాఖ కమిషనర్ అనుమతి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాటాదారుల లైసెన్స్‌లు కూడా ముడుపులు దండుకోకుండా ఇచ్చే అవకాశం ఎంతమాత్రం లేదనే విమర్శలు వ్యక్తవుతున్నాయి.

**ముడుపులు అబద్ధం**



మార్కెట్‌కు ఉల్లి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు బారీగా పెరిగినందున ఐదు విభాగాల్లో 200 మంది వరకు కొత్తగా హమాలీలను నియమించనున్నాం. ఇప్పటికే టెంపరరీగా పనిచేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు సత్వరం జరిగే విధంగా, జాప్యం లేకుండా కాటాలు వేయడం, లోడింగ్ చేయడం కోసం 200 మంది వరకు హమాలీలను నియమిస్తున్నాం. కాటాదారులను కూడా నియమించాల్సి ఉంది.ఇందుకు కమీషనర్‌కు ప్రతిపాదనలు పంపుతాం అయితే హమాలీ లైసెన్స్‌ల జారీలో ఒక్కొక్కరి నుంచి భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారనేది అవాస్తవం. ముడుపులతో మార్కెట్ కమిటీకి సంబంధం లేదు.

– జయలక్ష్మి, సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

### ఆటో బోల్తా పడి మహిళ మృతి



ఉలిగమ్మ (ఫైల్)

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ సమీపంలో ఆవును తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడి మహిళ దుర్మరణం చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఈఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కోసిగి మండలం దళవాయి గ్రామానికి చెందిన ఉలిగమ్మ(40), పార్వతి ఆటోలో ఆదోనికి బయలుదేరారు. పెద్దతుంబళం గ్రామ సమీపంలో ఆవును తప్పించబోయి ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న ఉలిగమ్మ, పార్వతికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఉలిగమ్మ కోలుకోలేక మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త వెంకటేష్, 9 మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### హోటల్‌లో అగ్ని ప్రమాదం

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో ఉన్న అబ్దుల్లా హోటల్‌లో మంగళవారం వేకువజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కిరాణా సరుకులు, గ్రైండర్, కుర్చీలు, టేబుళ్లు మొత్తం కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు రూ.1.50 లక్ష విలువ చేసే సామగ్రి కాలిపోయిందని బాధితుడు అబ్దుల్లా వాపోయాడు.

## రూ.14 కోట్లతో గాల్వోనియం షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఆదోని అర్బన్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగ దిగుబడులు వర్షానికి తడవకుండా రూ.14 కోట్లతో గాల్వోనియం షెడ్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. మంగళవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడా రు. ఎకరాని పెట్టుబడి, దిగుబడి, లాభం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పత్తి దిగు బడులు పరిశీలించారు. పత్తి దిగుబడులను సీసీఐకు విక్రయించుకుంటే మరింత లాభం వస్తుందని రైతులకు కలెక్టర్ సూచించారు. సీసీఐకి ఎలా విక్రయించుకోవాలో రైతులకు అవగాహన కల్పించాలని యార్డు అధికారులకు సూచించారు. మార్కెట్‌లో షెడ్ ఏర్పాటుకు కమిషనర్‌తో మాట్లాడతానని, డ్రైనేజీ ఏర్పాటు కు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇ చ్చారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర మౌర్య భరద్వాజ్, వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి ఉన్నారు.

**గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి**

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్యాధికారులను ఆదేశించారు. ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఓపీ వార్డును, పీపీటీసీ గది, యాంటినేటల్ వార్డు, రిజిస్ట్రేషన్ నమోదు కేంద్రం, నవజాత శిశువు సంరక్షణ విభాగం, పోస్టు ఆపరేటివ్ వార్డు-1, మెడికల్ రికార్డు రూమ్, గైనకాలజీ వార్డులను తనిఖీ చేశారు. అందుతున్న సేవలపై గర్భిణుల ను అడిగి తెలుసుకున్నారు. ఆదోని మాతాశిశు ఆస్ప త్రిలో ఇప్పటికే 12 మంది సిబ్బంది ఉన్నారని, గర్భిణు లకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గానూ అదనంగా 8 మంది స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్ వేశామని కలెక్టర్ తెలిపారు. వీరి ద్వారా షిఫ్ట్ పద్ధతిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పెచ్చులూడుతున్న గోడలకు మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు పంపాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ మాధవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవిలత ఉన్నారు.



పత్తి మార్కెట్‌లో యార్డ్ సెక్రటరీతో సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

## వృద్ధునికి అరుదైన కంటి ఆపరేషన్

- గ్లకోమాకు వాల్వ్ ఇన్‌ప్లాంటేషన్ చికిత్స

కర్నూలు(హాస్పిటల్): స్థానిక బుధవారపేటలోని సుశీల నేత్రాలయం డాక్టర్లు ఓ వృద్ధునికి అరుదైన కంటి శస్త్రచికిత్స నిర్వహించి చూపు ప్రసాదించారు. మంగళవారం ఆస్పత్రిలో సీఈఓ డాక్టర్ పి.సుధాకర్ రావు వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన గోవిందప్ప(70) గతంలో ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ చెందారు. ఆయనకు కుడికన్ను చూపు చిన్నతనం నుంచి దెబ్బతింటూ పోయింది. ఎడమ కన్నుకు కాటరాక్టు రావడంతో 2022లో వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత అదే కంటికి గ్లకోమా రావడంతో మందులు వాడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఉన్న చూపు కూడా పోవడంతో చికిత్స నిమిత్తం సుశీల నేత్రాలయ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు అతన్ని పరిశీలించి గత నెల 23న కార్నియా మార్పిడి ఆపరేషన్ చేశారు. ఇదే సమయంలో నీటి శుక్లాల వల్ల చూపు 80 నుంచి 90 శాతం దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఈ నెల 18న అత్యాధునిక గ్లకోమా వాల్వ్ ఇన్‌ప్లాంటేషన్ పద్ధతిలో శస్త్రచికిత్స చేసి చూపును కాపాడారు. ఇతనికి ఈహెచ్ఎస్ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందించినట్లు తెలిపారు. కార్నియా మార్పిడి ఆపరేషన్‌ను డాక్టర్ ఎస్. ఈశ్వర్, గ్లకోమా వాల్వ్ ఇన్‌ప్లాంటేషన్‌ను డాక్టర్ విజయలక్ష్మి నిర్వహించినట్లు డాక్టర్ సుధాకర్‌రావు వివరించారు. సమావేశంలో గైనకాలజిస్టు డాక్టర్ సావిత్రి, రెటీనా స్పెషలిస్టు డాక్టర్ నేహ సుధాకర్, గ్లకోమా స్పెషలిస్టు డాక్టర్ నేహ ఘోష్ పాల్గొన్నారు.



ఆపరేషన్ అనంతరం కోలుకున్న గోవిందప్పతో వైద్యుల బృందం

## పిచ్చి కుక్క కాటుకు ఆరు పశువులు మృత్యువాత

తుగ్గలి: పిచ్చి కుక్క కాటుకు గురై ఆరు పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధి లోని పీ కొత్తూరులో చోటుచేసుకుంది. రెండు రోజు ల వ్యవధిలో లక్ష్మీకాంతరెడ్డి, ప్రహ్లాద, పెద్ద అంజినయ్య, చిన్న అంజినయ్య, సుంకన్న, రామాంజనేయులుకు చెందిన ఆరు పాడి గేదెలు, ఆవులు మృతి చెందాయి. దాదాపు రూ.2.50 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మరో పది పశువులు పిచ్చి కుక్క కాటుకు గురైనట్లు రైతులు చెబుతున్నారు. మృతి చెందిన పశువులను మంగళవారం జొన్నగిరి పశువైద్యాధికారి బాలకృష్ణ పరిశీలించారు. ఘటనకు సంబంధించి ఉన్నతాధికారుల కు సమాచారం అందించామని, కర్నూలు నుంచి వ్యాక్సిన్ తెప్పించి మిగిలిన పశువులకు వేస్తామని చెప్పారు. కాగా ప్రభుత్వం నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## 'ఫేస్' బుక్ అయ్యాడు..!

- క్యాన్సర్ ఉంది..డబ్బు కావాలంటూ సందేశాలు
- ఫేస్ బుక్ ఖాతాతో బురిడీ కొట్టించిన మహిళ
- రూ.1.20 కోట్లు సమర్పించుకున్న తెలంగాణ వ్యక్తి
- వ్యవహారం బయటపడటంతో మహిళ ఆత్మహత్యాయత్నం

పత్తికొండ (తుగ్గలి): ఫేస్ బుక్ చాటింగ్ పరిచయంతో ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి పెద్ద మొత్తంలో డబ్బు కాజేసింది ఓ మహిళ. ఈ ఘటన పత్తికొండ మండలంలో చోటు చేసుకుంది. చక్రాళ్లకు చెందిన లావణ్య ఎమ్మిగనూరులో ఉన్న తన చెల్లెలు ఫొటో పెట్టి ఫేస్ బుక్ ఖాతా ద్వారా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన సాయిలుతో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుంది. పెళ్లి చేసుకుంటానని ఐదేళ్లుగా నమ్మిస్తూ వచ్చింది. తర్వాత తనకు క్యాన్సర్ వ్యాధి సోకిందని, ఆరోగ్యం బాగోలేదని చెప్పడంతో సాయిలు విడతల వారీగా రూ.1.20 కోట్లు సమర్పించుకున్నాడు. చివరకు తన భార్యను కూడా నమ్మించి డబ్బు కాజేసిందని బాధితుడు చెబుతున్నాడు. అనుమానం వచ్చిన సాయిలు పత్తికొండకు వచ్చి ఆరా తీసి మోసపోయానని తెలుసుకున్నాడు. డబ్బుల విషయమై పలుమార్లు పంచాయితీ జరిగినట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరులో ఉన్న ఆస్తులు అమ్మి ఇస్తానని చెబుతూ కాలం వెళ్లదీసింది. ఎంతకీ డబ్బులు ఇవ్వక పోవడంతో నాలుగు రోజుల క్రితం పత్తికొండకు వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మహిళ తండ్రి, మధ్యవర్తులు పంచాయితీ చేసి సమస్య పరిష్కరించుకుంటామని పోలీసులకు చెప్పారు. అయితే వ్యవహారం అంతటా దావణంలా వ్యాపించడంతో మనస్తాపానికి గురైన లావణ్య మంగళవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. ఈ విషయమై పట్టణ సీఐ జయన్నను సంప్రదించగా ఘటనకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ కురబ, కురువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడి నియామకం

కర్నూలు టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కురబ, కురువ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా కర్నూలు నగరానికి చెందిన గడ్డం రామకృష్ణను నియమించింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన్ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

### చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

గుత్తి: ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... కర్నూలుకు చెందిన మేరి సునీత, అన్నమయ్య జిల్లాకు చెందిన గుర్రం ప్రసాదరెడ్డి, షేక్ బాబ్జాన్ సాహెబ్ తదితరులు గుత్తికి చెందిన నిఖిల్‌తో పాటు మరి కొందరు నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి రూ.15 లక్షలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన నిఖిల్, తదితరుల ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

### కొనసాగుతున్న గాలింపు చర్యలు

వెలుగోడు: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ సమీప నిప్పుల వాగులో బాలిక ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యులు వెలుగోడు మత్స్యకారుల సహకారంతో అయ్యవారిపల్లె నుంచి సంతజూటూరు నిప్పుల వాగులో సాయంత్రం చీకటి పడే వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్‌లో గెలుపొందిన సిల్వర్‌జూబ్లీ కాలేజీ టీం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్

- క్లస్టర్ యువతరంగ్ పోటీలు

కర్నూలు సిటీ: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. క్లస్టర్ యువతరంగ్-2024 పేరుతో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ, సిల్వర్‌జూబ్లీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమయం కేటాయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి, వ్యాయామ అధ్యాపకులు వై.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

చదరంగం: పురుషుల విభాగంలో ప్రభుత్వం పురుషుల డిగ్రీ కాలేజీ ప్రథమ, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

- మహిళలు విభాగంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రథమ, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ద్వితీయ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి.
- మహిళా అధ్యాపకుల విభాగంలో ప్రథమ స్థానం ఎం.పద్మావతి, ద్వితీయ స్థానం పి.స్రవంతి( కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ) దక్కించుకున్నారు.

క్రికెట్: పురుషుల విభాగంలో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ విజేతగా నిలిచింది.

- అధ్యాపకుల విభాగంలో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రథమ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ద్వితీయ స్థానంలో నిలిచాయి.



### దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి?



కృష్ణయ్య (ఫైల్)

కోసిగి: దాడిలో గాయపడి వారం రోజులుగా చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కడదొడ్డి గ్రామానికి చెందిన మజ్జిగ కృష్ణయ్య(69) కుమారుడు గత నెల ఓ బాలికపై జరిగిన అత్యాయత్నంలో సహకరించాడని పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈక్రమంలో వారం క్రింతం పరారీలో ఉన్న కుమారుడి ఆచూకీ తెలపాలంటూ కృష్ణయ్యపై బాలిక బంధువులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యం అందించిన డాక్టర్లు.. పరిస్థితి సీరియస్‌గా ఉందని, వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. చేసేదేమీ లేక కృష్ణయ్యను కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో దాడిలో గాయపడటంతోనే తన భర్త మృతిచెందాడని బసమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ చంద్రమోహన్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రి తరలించారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకున్నామని, రిపోర్టు ఆధారంగా తదుపరి విచారణ ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతునికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

### కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు

కర్నూలు సిటీ: సుంకేసుల బ్యారేజీ నుంచి మంగళవారం కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నదిలో నీటి ప్రవాహం రోజు రోజుకు తగ్గిపోతుంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు బ్యారేజీకి ఎగువ నుంచి 6,940 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రస్తుతం బ్యారేజీలో 1.2 టీఎంసీల పూర్తి స్థాయి నీటి సామర్థ్యం మేరకు నీరు ఉంది. బ్యారేజీ నుంచి 4,479 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు.

### కోట్ల నగర్‌లో ఇసుక డంప్



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్

డోన్: పట్టణంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్ శివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుక డంపును నిర్వహిస్తున్నారు. కృష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన కొందరు మండలంలోని హంద్రీనది పరివాహక ప్రాంతంలో ఇసుకను తరలించి ఇక్కడ నిల్వ ఉంచినట్లు తెలిసింది. ఇక్కడి నుంచి అవసరమైన వారికి ట్రాక్టర్ ఇసుక రూ.6,500 నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను ఉచితంగా రవాణా చేసుకోవచ్చని వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అధికార పార్టీకి చెందిన నాయకులు ఆసరాగా చేసుకొని అక్రమ వ్యాపారానికి ఉపక్రమించినట్లు తెలుస్తోంది. ఈ విషయం రెవెన్యూ, పోలీసు, ఏడీఎంఈ అధికారులకు తెలిసినా ఆవైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు బస్సు సౌకర్యం

కర్నూలు సిటీ: ప్రయాణికుల సౌకర్యార్థం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు పల్లె వెలుగు బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నారు. ఈ బస్సు సర్వీసును బుధవారం ప్రారంభించనున్నట్లు డిపో-1 మేనేజర్ కె.సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8.45 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరి 9.30 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనుంది. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి కర్నూలు బస్టాండుకు 12.45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి 1.15 గంటలకు బయలుదేరి 2 గంటలకు ఎయిపోర్ట్‌కు చేరుకుంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి బస్సు బయలుదేరి 4.45 గంటలకు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. టికెట్టు ఒక్కొక్కరికి రూ.30గా నిర్ణయించినట్లు మేనేజర్ తెలిపారు.

## కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధర రూ.4,375

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర కొంతమేర పెరిగినప్పటికీ ఎక్కువ మంది రైతులకు అంతంతమాత్రం ధరలే లభించాయి. మార్కెట్‌కు 320 మంది రైతులు 5,785 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. మంగళవారం కనిష్ట ధర రూ.495, గరిష్ట ధర రూ.4,375 లభించింది. గరిష్ట ధర పెరిగినప్పటికీ సగటు ధర రూ.3,511 మాత్రం నమోదైంది. వ్యాపారులు సిండికేట్ కావడంతో ధర లభించక రైతులు నష్టపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

